రోజుల ముసురుకాగానే, యిది వరకు తుప్పల్లో, చెట్ల చాటుల్లో, కొండ చెరియల్లో బయట యేటి ఒడ్డున రాళ్ల సందుల్లో, చీకట్లో జరుగుతున్న కామకలాపాలు విహారాల్లోనే జరుగుతున్నాయ్. అడవి జంతువులు నివశించే గుహలుగానే విహారాలు మారిపోయాయి. పళ్లరసంలా పానీయాలే తాగి కొందరు సన్యాసులు, సన్యాసినులను చెయ్యి పట్టుకునిలాగి అసలు ముక్తికి యిదో సోపానమని రతికేళిలో మునిగిపోతున్నారు. కొందరు తాగుడు మైకంలో బుద్ధుడెంత పొరపాటు చేసాడో ఎత్తి పొడుస్తున్నారు. మోసం, తంత్రం మామూలు ఆయుధాల్లా ఒకరిపై యింకొకరు వుపయోగిస్తున్నారు. అక్కడక్కడ హింసాకాండ చెలరేగింది. మంజరి ధర్మపాలునికి, లేక ఆర్యదేవునికి దగ్గరలో వుంటోంది. ఎవ్వరూ తనవైపు చూడటానికి అసహ్యించుకున్నంతగా తయారవుతోంది. దగ్గరకొస్తే దుర్గంధం వచ్చినట్లుంది. రాత్రుళ్లు సరిగ్గా నిద్ర పోవటంలేదు.

"ఇంత గొప్ప చైత్యాలున్నాయిక్కడ యెదుటి వాళ్ల చింతలేదు. ఎవరి చింతలో వాళ్లు మునిగిపోయివున్నారు. చెరుగును యెదిరించలేని యీ సమాజంలో చెవుల పిల్లుల్లా బతికేంలాభం? ఎప్పుడు మనల్ని జీర్ణంచేసుకుంటారో? పదపారిపోదాం" అందిమంజరి ఆర్యదేవునితో.



చెదుగును
యెదిరించలేని
ఈ సమాజంలో
చెవుల పిల్లుల్లా
బతికి యేం
లాభం?......

"మరికొద్ది రోజులుఆగు" అన్నాడు.

వర్షం ఒక్కరోజు తెరిపియిచ్చి మళ్లీ పట్టుకుంది. ధర్మపాలుడు యీ గుహల్లో గబ్బిలాల్లా అంటుకపోయిన యీ మానవుల కంపును భరించలేక గుణధర్ముని వద్దకు వెళ్లాడు. వర్షంలో తడిచి నా గొంతుక ధాటి తగ్గలేదు. ధర్మపాలుడు వెళ్లేసరికి మారుని కూతురుగా ప్రసిద్ధిపొందిన స్త్రీ గుణధర్ముని ఒడిలో కూర్చోని వుంది. ప్రణయానికి వేళాపాళా లేనట్లుంది.

"తథాగతుడు వర్షాకాలంలో బౌద్ధ ధర్మంగురించి చర్చించి పరిడిద్దుకునే ఆనవాయితీ పెట్టాడు. అంచేత వెంటనే సర్వ సన్యాసుల సభను యేర్పాటు చేయమని కోరడానికి వచ్చాను" అని అన్నాడు.

అతనిని వెంటనే పంపించేయాలని కామోసు

"అలాగే. రేపే పిలుస్తాను" అన్నాడు గుణధర్ముడు.

ఆ మరునాడు సభ కిటకిటలాడుతోంది. ఒకాయన బౌద్ధం గురించి యెత్తి పద్మసంభవుని గురించి మాటాడబోతే, యింకొక సన్యాసి తన శరీరం, పలుకు, బుద్ధిని, తథాగతుని శరీరం బుద్ధిగా మార్చడానికి యేమి చెయ్యాలో చర్చించుదామని ఒక తీర్మానం ప్రవేశపెట్టాడు. దీని విషయం మాట్లాడటానికి వచ్చినట్లుగా ధర్మపాలుడు, గుణధర్ముడుకూర్చున్న ఆసనం ప్రక్కనే నిల్చున్నాడు. అతని గంభీరమైన గొంతుకలో వణుకూ, బెణుకూ లేదు. కంచు గంటలా మోగుతున్న స్వరంతో ధర్మపాలుడు వుపన్యసించాడిలా–

"మానవులకు రెండు రకాల సుఖాలుంటాయి. శరీరానికి సంబంధించినది – ఆత్మకు సంబంధించినది. వివిధమైన వుద్రేకాలతో, క్షణిక సుఖాలను కాంక్షించే మానవులు, శాశ్వత సుఖం నిచ్చేమతం, ప్రదేశం, వ్యక్తి గ్రంధాన్ని వెతుక్కోవటం సహజం. అలా వెతుక్కొని రాతగ్గ ప్రదేశం యీ అజంతా అని ఆశతో అమరావతి నించి వచ్చాను. కానీ నేనిక్కడ చూసిందేమిటి? ఇది చైత్యవిహారాల పేరుతో నున్న శృంగారవనం, సువాసనల విలేపన భూమి. ఈ గుహలు ప్రేమికుల ధారాగృహాలై పోయాయి. ఇక్కడ మోసం, అబద్ధాలు, హింస, దబాయింపు, దౌర్జన్యం యేంలేదు? ఒకరీతి, ఒక బాధ్యత యేదీ లేని యీఅధర్మ చక్రాన్ని మనమే త్రిప్పి, తథాగతుని త్యాగంతో సృష్టింపబడిన మన బౌద్ధ మత ధర్మాన్నే తెగేస్తు న్నాం."

"అయితే యీ పరిస్థితిని మెరుగుపర్చడానికి నీ సూచన లేమిటి?" అన్నాడు గుణధర్ముడు.

"నా బాధతో అరచిన అరుపుల్లోనే, మార్పుకు మార్గం వుంది. ఆ మాత్రం తట్టకపోతే నానోట స్పష్టంగా చెప్పనీ. ఈ దుర్గతికి కారణం గుణధర్మా నువ్వు అజంతాని ఒక రాజ్యం చేసి చక్రవర్తిలా అన్ని భోగాలూ అనుభవించి యేలుతున్నావు.నీలోగుణంలేదు. ధర్మం లేదు. నేను ఒక్కవారం రోజులు నీకు గడువు యిస్తున్నాను. ముందునీవు మారనిది నీ వెంట నడిచే యీ గొర్రెలు మారవు..."

పెద్ద గోల

"గొర్రెలు కాదు – గబ్బిలాలు"

ఇంకా గోల.

"గొర్రెలూ, గబ్బిలాలు కావు. పెద్ద పులులు – ఈ పెద్దపులులను మచ్చిక చేస్తే నువ్వెంతయినా సాధించగలవు. అందుకే ముందు నీవు నిన్నునీ ఒడిలో కూర్చోబెట్టుకున్న స్త్రీని ఆమె వూరు పంపించు. భాగ్యభోగ్యాలను వదలి ఒక భిక్షాపాత్ర పట్టుకుని దండుకుని రోజుకొక పూట తిను..."

గుణధర్ముడు లేచి

"ధర్మపాలుని సూచనను మీ ముందు పెట్టున్నాను. మీరే మంటే దానినే పాటిస్తాను." అని కూర్చున్నాడు.

సభలో కోలాహలం. సంఘరక్షితునితోపాటు అతని మూకంతా కేకలు వెయ్యటం మొదలు పెట్టారు. ఇంకెవరినీ మాట్లాడనివ్వలేదు.

"ఎన్నాళ్లకో వచ్చిన యీకొత్త మార్పును ఆదరిస్తాం, ఆదరించి తీరుతాం. అడుక్కుతినే గతి మాకొద్దు"

కాస్సేపయ్యాక గుణధర్ముడు ధర్మపాలుని వేపు చూసి

"ఇప్పుడేం చెయ్యాలో చెప్పు?"

"ఏం చెయ్యాలో నన్ను అడగటం దేనికి? నీకు తెలీదా? ఈ వేళనించీ ఒక వారం రోజులు నిరాహారదీక్ష పూనుతున్నాను!"

(సశేషం)

కాలమ్ దాటని కథ

## "ఇంగ్లీషు అమ్మ"

నిన్న జరిగిన సంగతే గుర్తుకు వస్తోంది.

మళ్ళీ మళ్ళీ గుర్తుకు వస్తోంది. ఎంత అందంగా... చక్కగా చెప్పాడు రవి. రవికి పన్నెండేళ్ళు. 'రజితా' కాన్వెంట్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. చదువంటే తగని మక్కువ. విజ్ఞానానికి సంబంధించిన సమాచారం మరీమరీ చదివి — ఏవేనా సందేహాలుంటే అడిగి తెల్సుకోకపోతే – నిద్రకూడా పట్టదు. అంత పట్టుదల వాడికి – అంత జిజ్ఞాసాపరుడు. రవి చదివే కాన్వెంట్ లోనే ఉపాధ్యాయునిగా పనిచేస్తూ రవివాళ్ళ క్లాసుకి భూగోళశాస్త్రాన్ని చెప్తూ వుంటుంది రవి 'అమ్మ'

రవికి మల్లే మరికొంతమంది ఆ స్కూలులో పనిచేసే ఉపాధ్యాయినుల పిల్లలుకూడా చదువుతున్నారు. వాళ్ళంతా కూడా వాళ్ళ అమ్మల్ని 'మమ్మీ' అని పిలుస్తుంటారు. రవి మాత్రం స్కూల్లో కూడా 'అమ్మా!' అనే పిలుస్తూ వుంటాడు. రవి తల్లికి రవిలో నచ్చని విషయం ఇదే!

నిన్న క్లాసులో వాళ్ళకి ఈజిప్టు గురించి క్లాస్ తీసుకుంది. క్లాసు అయిపోయాక టీచర్సు రూంలోకి రవి, మరికొంత మంది పిల్లలు ఇంటర్వెల్‌లో వచ్చారు.

'మిసెస్ మూర్తీ... మీ వాడొచ్చాడు. ఏం డౌటు వచ్చిందో మళ్ళీ...' కామెంట్ చేసిందో టీచర్.

తన వేపు చూసేంతలోనే రవి — 'అమ్మా! ఇందాక మీరు చెప్పిన పిరమిడ్ల గురించి మళ్ళీ ఒక్క సారి చెప్పండి... ఎందుకంటే వాటిల్లో దాచివుంచిన శవాలు ఎంత కాలమైనా ఎలా చెడిపోకుండా వుంటాయో మాకర్థం కావడం లేదు" అని అడిగాడు.

మిగిలిన టీచర్ల ముందు తనను 'అమ్మా' అని పిలిచినందుకు కాస్త అదోలా అనిపించినా ... వెంటనే తేరుకుని చెప్పసాగింది.

"ఆ దేశ ఆచారాల ప్రకారం అప్పట్లో ఆ చనిపోయినవారు మళ్ళీ ఎప్పటికైనా బ్రతుకుతారేమోనన్న ఆశతోనూ... మరికొన్ని ఆశలతోనూ కొందరు... అది ఆచారంగా వస్తోంది కనకనూ మిగిలినవాళ్ళు కొన్ని పద్ధతులు అంటే... ఆ శవాలని వివిధ రసాయనిక ద్రవ్యాలతో శుభ్రంచేసి... మరికొన్ని అలాంటి పద్ధతులతోనూ వాటిని పదిలపరచి, వారికి సంబంధించిన వస్తువులు, ఆభరణాలు వాటితో కలిపి వాటిల్లో దాచివుంచుతారు. ఇలా దాచివుంచబడిన 'శవాలని' మమ్మీ అని పిలుస్తూవుంటాంమనం" అంటూవివరించసాగింది మిసెస్ మూర్తి.

మధ్యలో అడ్డుపడ్తూ... అలవాటు ప్రకారంగా రవి... "అమ్మా! ఆ చచ్చిపోయిన వారి 'శవాలని' మనం యిప్పుడు 'మమ్మీ'లని పిలుస్తున్నాం కదా... మరి... నా ఫ్రెండ్స్ మరి వాళ్ళమ్మల్ని 'మమ్మీ' అని పిలుస్తుంటారు కదా... అంటే వాళ్ళమ్మలు బ్రతికి వున్న 'శవాలనా' అర్థం? రవి ప్రశ్నకి ఏం సమాధానం చెప్పగలదు వాళ్ళమ్మ? మరి ఎవ్వరూ కూడా జవాబు చెప్పలేక రవినే చూస్తూ వుండిపోయారు.

— పంతుల సౌమిత్రి